క్లుప్తంగా

నష్ట పరిహారం అందజేత



చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందిన నల్లా సాయికుమార్ కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి మంజూరైన రూ.5 లక్షల నష్టపరిహారం చెక్కును ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అందజేశారు. అనంతరం గుమ్మడిదల మండలం అన్నారం, జిన్నారం మండల లక్ష్మీపతిగూడెం గ్రామాల్లో ఇద్దరు రైతులకు చెందిన రెండు గేదెలు విద్యుత్ షాక్‌తో మృతి చెందాయి. వాటికి ఒక్కోదానికి రూ.40 వేల చొప్పున రూ.80 వేలు నష్టపరిహారం బాధిత రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ మాజీ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, విజయ్ భాస్కర్‌రెడ్డి, ఆంజనేయులు, షేక్ హుస్సేన్, విద్యుత్ శాఖ ఏడీలు దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ఏఈలు రాజు, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని జూకల్ శివారులో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల పార్ట్ టైం ఉపాధ్యాయులు, అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం లేదని సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఇతర శాఖల్లోని పార్ట్ టైం ఉద్యోగులకు వేతనాలు అందుతున్నా.. ఎస్సీ సంక్షేమ శాఖ పరిధిలోని గురుకులాల్లో పని చేస్తున్నా తమకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు.

అవగాహన తప్పనిసరి



సదస్సులో మాట్లాడుతున్న రమేశ్

కొండాపూర్(సంగారెడ్డి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి రమేశ్ అన్నారు. మండలంలోని గిర్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో న్యాయ వ్యవస్థపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థల్లో క్రమశిక్షణ కల్గిండాలన్నారు. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి బాగోగులను చూడాలని గురుకుల పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. గృహహింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోక్సో చట్టం, వరకట్న నిషేధం వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, ఏదైనా న్యాయ సహాయం కావాలంటే సంగారెడ్డిలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సదస్సులో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

రాయికోడ్(అందోల్): మండలంలోని సింగితం గ్రామంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం విరాళాలు సేకరించారు. అక్టోబర్ 19, 20 తేదీల్లో నిర్వహించే పార్టీ జిల్లా మహాసభల కోసం ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ దశరథ్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, టీచర్లు

జహీరాబాద్: పట్టణంలో బతుకమ్మ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అల్లీపూర్‌లోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాల ప్రాంగణంలో తీరొక్క పూజలతో భారీ బతుకమ్మను పేర్చి, గౌరమ్మను ప్రతిష్ఠించి, విద్యార్థినులు ఆడిపాడారు. విద్యాసంస్థల చైర్మన్ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. పూలను పూజించడం తెలంగాణ సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దినేష్, వైస్ ప్రిన్సిపాల్ గాజుల లక్ష్మి, ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్సిడీ పథకాలకు మోక్షం ఎప్పుడో!

- సబ్సిడీ పరికరాలపై దృష్టి సారించాలని రైతులు వేడుకోలు



వ్యవసాయ యంత్ర పరికరాలు

మునిపల్లి (అందోల్): పంటసాగులో ఖర్చు తగ్గించడంతో పాటు పనులు వేగంగా చేసేందుకు యంత్రాలను వినియోగించాల్సి ఉంది. ప్రభుత్వం యంత్ర పరికరాల పథకానికి నిధులను మంజూరు చేయకపోవడంతో సబ్సిడీ పథకాన్ని నిలిపేసిందనే సందేహం వ్యక్తమవుతోంది. 2018 వర్షాకాల సీజన్ నుంచి గత ప్రభుత్వం రైతుబంధును అమలు చేసింది. పెట్టుబడి సాయం మంజూరు చేస్తున్నామనే ఉద్దేశంతో యంత్రాల కొనుగోలుకు సబ్సిడీకి నిధులు ఆపేసింది. వ్యవసాయ యాంత్రీకరణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండు రాయితీలను మంజూరు చేసేవి. రైతులకు నాగళ్లు, కల్టివేటర్లు, గొర్రు, పాలిథిన్ కవర్లతో పాటు తదితర పరికరాలను 30 నుంచి 50 శాతం సబ్సిడీపై మంజూరు చేసేది. గత ప్రభుత్వం తొలినాళ్లలో యంత్రలక్ష్మి పథకాన్ని అమలులోకి తీసుకువచ్చి భారీ సబ్సిడీపై ట్రాక్టర్లను రైతులకు మంజూరు చేశారు. రైతులకు ట్రాక్టర్ల కొనుగోలు భారం తప్పడంతో దుక్కిదున్నడానికి అనువైనా మార్గం లభించింది. 2018లో యాంత్రీకరణ పథకం అమలు నిలిపేయడంతో రైతులు రాయితీకి నోచుకోక ఆర్థిక భారం మోస్తున్నారు. రుణమాఫీతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ, జాతీయ ఆహార భద్రత కమిషన్ (ఎన్ఎఫ్ఎస్ఎం) ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) తదితర పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కొంత మేర నిధులను కలిపి రైతులకు వ్యవసాయ పరికరాలను సబ్సిడీపై మంజూరు చేసేది. బడ్జెట్‌లో యాంత్రీకరణకు నిధులు కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అమలుకు మార్గదర్శకాలు జారీ కాకపోవడంతో పథకం అమలుపై స్పష్టత లోపించింది. ప్రభుత్వం యాంత్రీకరణకు ప్రోత్సాహకాలను పునఃరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీ మంజూరు చేయాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్, యంత్రీకరణ పరికరాలను మంజూరు చేసి ఆదుకోవాలి. వ్యవసాయం చేయడానికి ఎద్దులు కొందామన్నా లక్షల రూపాయలు ఖర్చవుతోంది. రైతులంతా పత్తి పంట ఎక్కువగా వేయడంతో ఎద్దులకు మేత దొరకని పరిస్థితి ఏర్పడింది.

–బి. సుధాకర్, ఎటిగడ్డ సంఘం

రైతులను ప్రోత్సహించాలి



సన్న, చిన్నకారు రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి. సబ్సిడీ పథకాలను పునఃరుద్ధరించాలి. ఎంతో మంది రైతులు యంత్రాలను కొనుగోలు చేయలేక అవస్థలు పడుతున్నారు.

–రాం చంద్రయ్య, మాలపాడు

ఎలాంటి ఆదేశాలు రాలేదు



సబ్సిడీపై యంత్ర పరికరాలను రైతులకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే సబ్సిడీ యంత్ర పరికరాలను అర్హులైన రైతులకు పంపిణీ చేస్తాం.

–శివప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: గురుకులాల్లో అవసరమైన సౌకర్యాలన్నీ కల్పిస్తామని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఖేడ్ మండలం జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులం ఆవరణలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనివారం గురుకులాన్ని సందర్శించి, సమస్యలు తెలుసుకుని ఆదివారమే హైమాస్ట్ లైట్లు, 2వేల లీటర్ల సామర్థ్యం గల రెండు సింటెక్స్ ట్యాంకులు, ఎనిమిది ట్యూబు లైట్లు, ఫ్యాన్లను ఏర్పాటు చేయించానని తెలిపారు. సమస్యలు పరిష్కరించిన ఎమ్మెల్యేకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారంశంకర్, కౌన్సిలర్లు వివేకానంద్, రాజేష్ చౌహాన్, హన్మాండ్లు, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి పాల్గొన్నారు. అలాగే, జూకల్, జూకల్ తండాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు.

సాధనతోనే క్రీడల్లో రాణింపు



నారాయణఖేడ్: పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రతి క్రీడాకారుడు అత్యుత్తమ సాధనతో జాతీయ స్థాయికి ఎదగాలని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి పేర్కొన్నారు. నిజాంపేట్ మండల కేంద్రంలో సోమవారం ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ రెజ్లింగ్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో కష్టపడి సాధన చేసిన వారే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. గెలుపోటములు సహజమని, ఓటమి పొరపాట్లను సరిచేసుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఖేడ్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అమూల్యమ్మ, పీడీలు విఠల్, మారుతి, సంగ్రాం, రమేష్, నిజాంపేట నాయకులు రాధాకిషన్, క్రిష్ణ, ప్రకాష్, వారీస్, శ్రీకాంత్, వెంకటేశం, లింగారెడ్డి, పరశురాం పాల్గొన్నారు.

పంచవటి క్షేత్రంలో పూజలు

నారాయణఖేడ్: మాసశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని పంచవటి క్షేత్రాన్ని సోమవారం ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి దర్శించుకొని, పూజలు చేశారు. అనంతరం ఆలయపీఠాధిపతి కాశీనాథ్ బాబా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు.

పరిసరాల పరిశుభ్రత బాధ్యత

- ప్రిన్సిపాల్ శ్రీనివాస్



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని పటాన్ చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయ ఆవరణలో స్వచ్ఛభారత్, హరిత హారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు డివిజన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వెంకటేశం, కరుణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, డాక్టర్ సుజాత, శివ, దీప్తి, షరీఫ్ మియా, యోగిబాబు సురేష్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సింగూరుకు పెరిగిన వరద

పుల్కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద పెరిగింది. డ్యాంలోకి ఎగువ నుంచి 13557 క్యూసెక్కుల నీరు రావడంతో 11 నంబర్ గేట్‌ను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. జలవిద్యుత్ కేంద్రానికి 2,823 క్యూసెక్కుల నీరు వదలడంతో జెన్‌కో అధికారులు రెండు టర్బయిన్ల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

మాంసం విక్రయిస్తే చర్యలు

సదాశివపేట(సంగారెడ్డి): గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న (బుధవారం) మాంసం, చేపల విక్రయాలు చేపడితే మున్సిపల్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఉమా సోమవారం ఒక ప్రకటన హెచ్చరించారు. దుకాణాల లైసెన్స్ రద్దు చేసి, షాపులను సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామన్నారు. మాంసం దుకాణాలు బంద్ చేయాలని తెలిపారు.

ప్రత్యేక అధికారిగా అనిల్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండల ప్రత్యేకాధికారిగా ఎం.అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి అనిల్‌కుమార్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ కలెక్టర్ వల్లురు క్రాంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీఓ శ్రీనివాస్‌లు, సూపరింటెండెంట్ సంగ్రామ్ మర్యాదపూర్వకంగా కలిసి అనిల్‌కుమార్‌ను అభినందించారు.

గురుకుల విద్యార్థుల సత్తా

హత్నూర(సంగారెడ్డి): ఇటీవల జిల్లాస్థాయిలో జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో హత్నూర గురుకుల పాఠశాల సత్తా చాటిందని సోమవారం ప్రిన్సిపాల్ భిక్షమయ్య తెలిపారు. ఖోఖో అండర్- 17, 14 బాలుర పోటీలు జరిగాయి. ఇందులో అండర్- 17లో మొదటి స్థానం, అండర్-14లో రెండవ స్థానంలో విజయం సాధించారని తెలిపారు. పీడీఏ. సురేందర్ పీఈటీఎస్. శాంతికుమార్ విద్యార్థులను అభినందించారు.

‘అంబేడ్కర్ అభయ హస్తం’ అమలు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేడ్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంబేడ్కర్ అభయ హస్తం కింద రూ.12 లక్షలు ప్రతి దళిత కుటుంబానికి ఇస్తామని చేవెళ్ల డిక్లరేషన్‌లో చెప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడుస్తున్నా.. పథకం అమలుపై ఎలాంటి స్పష్టత లేదన్నారు. అక్టోబర్ 2న కేవీపీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణలు, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు దత్తు, జయకుమార్, చంద్రశేఖర్, మహేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

కొండాపూర్(సంగారెడ్డి): అర్హులైన పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన సీపీఎం మహాసభల్లో ఆయన మాట్లాడారు. గత 3 సంవత్సరాల్లో జరిగిన పార్టీ కార్యక్రమాలు, అనుభవాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోవడం జరిగిందన్నారు. ఈ మహాసభ సందర్భంగా పార్టీ ఎనిమిది తీర్మానాలను చేసిందన్నారు. మండల పరిధిలో గోపులారం పెద్ద చెరువులోకి కంపెనీ పరిశ్రమల వ్యర్థ కాలుష్య నీరు చేరడంతో మూగజీవులు మృత్యువాత పడుతున్నాయని, అలాగే భూగర్భజలాలు కూడా తాగడానికి పనికిరాకుండా పోయాయిని అన్నారు. ట్రిబుల్ ఆర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ వర్గ సభ్యులు మాణిక్యం, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు, మండల కార్యదర్శి రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, నరసింహారెడ్డి, మహిపాల్ రెడ్డి, ఆసిఫ్ అలీ, ప్రవీణ్‌కుమార్, అమృతమ్మ, శాఖ కార్యదర్శిలు వెంకటేశం, శ్రీను, వెంకయ్య, సంజీవులు పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో మంచి ఫలితాలు



పురస్కారం అందజేస్తున్న ఎస్‌ఐ

జహీరాబాద్: సమష్టి కృషితో పని చేసి, ఆర్టీసీని కాపాడుకోవాలని ఎస్‌ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ బస్‌డిపో ఆవరణలో ప్రగతి రథచక్రాల పురస్కారాలను కార్మికులకు అందజేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడు సంస్థను సొంతదిగా భావించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అందరి కృషి వల్ల ప్రయాణీకులకు ఉత్తమ సేవలందించడంలో ముందున్నామన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు తమ విభాగాల్లో అందించిన ఉత్తమ సేవలను గుర్తించి పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ జాకీర్‌హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్ల పరిశీలన



జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

- ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: బతుకమ్మ ఘాట్ల వద్ద ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం పటాన్ చెరు డివిజన్ కార్పొరేటర్ మెట్టుకుమార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్‌లతో కలిసి సాకి చెరువును ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆడపడుచుల అతిపెద్ద పండుగ బతుకమ్మ ఉత్సవాలకు చెరువుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ డీసీకి సూచించారు. అనంతరం పటాన్ చెరులోని బండ్లగూడ కాలనీలో గల చెరువును కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ పరిశీలించారు. ప్రతి ఏడాదిలాగే ఘాట్ల వద్ద పారిశుద్ధ్య పనులు, లైట్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శివకుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరం

- ఎమ్మెల్యే ప్రభాకర్, టీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి

సంగారెడ్డి : కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరమని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి అన్నారు. సోమవారం నియోజకవర్గానికి చెందిన 741 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్, చైర్మన్ నిర్మల లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెక్కుల పంపిణీ ఆలస్యం కావడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. గతంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసి క్యాన్సల్ చేశారని తెలిపారు. చెక్కుల పంపిణీలో ఆలస్యం చేయొద్దని అధికారులను కోరారు. అనంతరం నిర్మలారెడ్డి మాట్లాడుతూ.. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజు, కాంగ్రెస్ నాయకులు తోపాజీ అనంత కిషన్ మాజీ ఎంపీపీ అంజనేయులు, నాయకులు సంతోష్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మందుబాబులకు జరిమానా, జైలు**

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఒక్కొక్కరికి రూ. 2 వేలు చొప్పున, మరో వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

◆ **ఐదుగురికి జైలు శిక్ష**

సంగారెడ్డి క్రైమ్ : మద్యం సేవించి వాహనాలు నడిపిన ఆరుగురికి పోలీసులు జరిమానా విధించారు. సంగారెడ్డి పట్టణంలోని పాతిరెడ్డిపల్లి చౌరస్తాలో పట్టణ సీఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆరుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారు. ఒకరికి రూ.రెండు వేలు జరిమానా, మిగతా ఐదుగురిని కోర్టులో హాజరుపరచగా కోర్టు జైలు శిక్ష విధించింది.

◆ **ఎంఈఓకు సన్మానం**

మునిపల్లి(అందోల్): రాయికోడ్ ఎంఈఓ ఎస్. శ్రీనివాస్‌ను ఉపాధ్యాయులు సోమవారం సన్మానించారు. అలాగే, రాయికోడ్ ఎంఈఓగా వచ్చిన అంజయ్య కూడా ఉపాధ్యాయులు శాలువా, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా సీఆర్పీలుగా విధులు నిర్వహించి ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన జనార్దన్, శశికళను సన్మానించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఉపాధ్యాయులు, మోహన్, రాజు, దత్తు పాల్గొన్నారు.

◆ **వ్యక్తికి గాయాలు**

న్యాల్‌కల్ (జహీరాబాద్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయిన ఘటన మండల కేంద్రం న్యాల్‌కల్‌లో చోటు చేసుకొంది. హద్నూర్ పోలీసుల కథనం ప్రకారం.. న్యాల్‌కల్‌కు చెందిన కటికె ఇస్మాయిల్ పని నిమిత్తం మోటారు సైకిల్‌పై ఇబ్రహీంపూర్‌కు వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా న్యాల్‌కల్ గ్రామ శివారులో ఎదురుగా అతివేగంగా వస్తున్న మోటారు సైకిల్ ఢీకొంది. దీంతో కింద పడిపోయిన ఇస్మాయిల్ తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బీదర్ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

◆ **ఆన్‌లైన్ తప్పులను సరిచేయాలి**



మునిపల్లి(అందోల్): ప్రజాపాలన దరఖాస్తులో ఆధార్ నంబర్, ఇతరరాత్ర పేర్లను ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేసిన వాటిని సరిచేయాలని తాటిపల్లి గ్రామానికి చెందిన రాజిరెడ్డి, సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ హరినందన్‌రావు, తహసీల్దార్ అశాజ్యోతిలకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యం వల్ల కంప్యూటర్ ఆపరేటర్లు ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేశారని అన్నారు. అంతేకాకుండా ప్రజాపాలన దరఖాస్తులను మరోసారి పరిశీలించి తప్పులను సరిచేసి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **తాటి చెట్లు ఎక్కడంపై శిక్షణ**

కంది(సంగారెడ్డి): మండలంలోని చిద్రుప్పలో సేఫ్టీ కిట్లను ఉపయోగించి తాటి, ఈత చెట్లు ఎక్కడంపై గీత కార్మికులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. బీసీ వెల్ఫేర్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో 40మంది గౌడ కులస్తులు పాల్గొన్నారని ఎక్సైజ్ ఎస్సై జగదీష్ తెలిపారు. ఈత, తాటి చెట్ల నుంచి కల్లు గీసే క్రమంలో చెట్లపై నుంచి పడి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న గౌడ్ అన్నారు. ఈ శిక్షణ కల్లు గీత కార్మికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, నాయకులు శ్రీనివాస్ గౌడ్, నరసింహగౌడ్, కృష్ణ గౌడ్, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పీపీ రాథోడ్‌కు సన్మానం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం మండల ఎంఈఓ పీపీ రాథోడ్‌ను సోమవారం బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బలరాం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని కోరారు.

◆ **ఆలయ హుండీ లెక్కింపు**

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని వీరభద్రేశ్వర ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఏఈ శివరుద్రప్ప, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శివరాజ్, స్థానిక ఎస్‌ఐ నారాయణ సమక్షంలో ఆలయ సిబ్బంది హుండీలోని నగదును లెక్కించారు. ఈ ఏడాది మే 18 నుంచి ఇప్పటివరకు భక్తులు హుండీలో వేసిన నగదును లెక్కించగా రూ.3,54,388లు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మాణ్యయ్య, సిబ్బంది కృష్ణ, అర్చకులు వీరయ్య స్వామి, శివకుమార్, బస్వరాజ్, శివ ఉన్నారు.

◆ **ఉత్సవాలకు ఏర్పాట్లు**

నారాయణఖేడ్: ఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేట్‌లో దుర్గాభవానీమాత ఆలయం వద్ద దసరా, దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు సోమవారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. ఆలయ ఆవరణను జేసీబీతో చదును చేయించారు. చుట్టూ పక్కల ఉన్న ముళ్ల పొదలను తొలగించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ ఆయా పనులను పర్యవేక్షించారు.

మనుషులందరూ సమానమే



న్యాల్‌కల్: మాట్లాడుతున్న రాజిరెడ్డి

సంగారెడ్డి క్రైమ్: ఎస్సీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, సమాజంలో మనుషులందరూ సమానమేనని విజిలెన్స్ కమిటీ మెంబర్ చంద్రశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఎస్సీ ఎస్టీ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.

కొల్లూరులో సివిల్ రైట్స్ డే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరులో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. ఎస్సీలపై దాడులను ఖండించారు.

కలసిమెలసి ఉండాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): కుల, మత భేదాలు లేకుండా అందరూ సోదరభావంతో కలసిమెలసి ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి అన్నారు. ఖలీల్‌పూర్‌లో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెండు గ్లాసుల పద్ధతి, అంటరానితనానికి స్వస్తి పలకాలన్నారు.

కల్హేర్(నారాయణఖేడ్): అందరు కలిసి ఉండాలని తహసీల్దార్లు శివశ్రీనివాస్, ఉమాశంకర్ పేర్కొన్నారు. కల్హేర్ మండలం ఇందిరానగర్, సిర్గాపూర్, పోచాపూర్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించారు.